
# గురుదక్షిణ

అవధానుల జగన్నాథరావు & మల్లంపల్లి గాంధీరామారావు



"వరండాలో కాస్త లైటు వేసి వెళ్ళమ్మా" అన్నారు ధర్మారావుగారు నెమ్మదిగా.

వంటింట్లో వంట ప్రయత్నాలు చేస్తున్న శాంత నెమ్మదిగా వచ్చి లైటువేసి...గ్లాసుతో మంచినీళ్ళందించింది.

గత పదేళ్ళుగా ఈ తండ్రీ కూతుళ్ళకది అలవాటే—

చీకటిపడే వేళ ఆయన లైటు వేయమని చెప్పడం, శాంత లైటు వేయడంతో బాటు గ్లాసుతో మంచినీళ్ళు అందించడం.

ఆప్యాయంగా కూతురి ముఖంలోకి చూశారు ధర్మారావుగారు. తలదించుకొని వంటింట్లోకి వెళ్ళిపోయింది శాంత.

"శాంతకి పెళ్ళి చేసి...తక్షణం పంపించేయాలి" అనుకున్నారు ధర్మారావుగారు బాధగా.

పదేళ్ళుగా తను శాంతని కన్నతల్లిలేని లోటు లేకుండా పెంచాడో, శాంతమ్మే తనకన్నీ అయి పెంచిందో అర్థంగాదు ఆయనకి. తండ్రిగా తన బాధ్యత—శాంతనో యింటిదాన్ని చేసి పంపేయడం.

కాని పంపించడం ఎలా ?

ఓ మంచి యింట్లో పడేయడానికి కావలసిన వేలకి వేలు కట్నాలు తాను తీసుకురాగలడా ?

ఉన్న యిల్లు కాస్తా తెగనమ్మి...పెళ్ళి చేసి పంపించినా శేష జీవితంలో తనని చూసుకునే దిక్కెవరు ?

తనని ఆదరించే విశాల హృదయుడైన అల్లుడు దొరకడం సంభవమేనా ?

సమాధానంలేని ఈ ప్రశ్నలు – పదేపదే సతమతం చేస్తుంటే అలాగే కుర్చీ వెనక్కు జేరబడి కనులు మూసుకొని నిద్రలో కొరిగారు ధర్మారావుగారు.

* * *

రిటైరైన దగ్గర్నుండి తన పెళ్ళి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్న తండ్రిని చూస్తుంటే—దిగులు వేస్తోంది శాంతకి.

"ధర్మారావు మాస్టారు నిజంగా ధర్మరాజే." అన్నపేరు తప్ప మరేమీ మిగుల్చుకోలేకపోయారు జీవితాన్ని విద్యార్థులకంకితం చేసిన ధర్మారావు గారు.

రాత్రనక, పగలనక విద్యార్థులకి శ్రమించి పాఠాలు చెప్పడం తప్పించి ప్రతిఫలం ఆపేక్షించని త్యాగమయ జీవితం ఆయనది.

ఇరవై అయిదేళ్ళు ఆయనతోబాటు కష్టసుఖాలు పంచుకున్న అమ్మ జీవితంలో ఆలస్యంగా మాతృమూర్తిగా మారి, ఆ మాతృత్వంలోని మాధుర్యాన్ని పూర్తిగా గ్రోలకుండానే ఆ పరమేశ్వరునిలో ఐక్యమయింది – తనని నాన్న కందించి.

అనుక్షణం తనమీద ఆధారపడే నాన్న...

తన అండలేని నాన్న ఒంటరి జీవితాన్ని, ఊహించలేకపోతోంది శాంత.

"వీధి అరుగుమీద దంత ధావనంకోసం నీళ్ళు పెట్టడం మొదలు, రాత్రి పడుక్కోబోయే ముందు "భగవద్గీత"లోని కొన్ని శ్లోకాలు చదవడంవరకూ, అన్ని పనులూ నాన్నకి క్రమం తప్పకుండా ఎవరు చేసిపెడతారు ?"

"చిన్న ప్రాణినికూడా హింసించని ఆయన సుకుమారమైన మనస్తత్వాన్ని అర్థం చేసికొని ఆదరించేదెవరు ?"

జవాబులేని ప్రశ్నలు... మనస్సును ఆందోళనాభరితం చేస్తున్నాయి.

"ఎవరైనా యోగ్యుడు ఇల్లరికానికి యింటికివస్తే" – తన ఆలోచనకి తనకే నవ్వు వచ్చింది శాంతకి.

"కట్నంలేకుండా కట్టుకోవడమే కాకుండా మామగారి బాధ్యతనికూడా తీసుకునేందుకు ఎవరు సిద్ధపడతారు ?"

ఆలోచనల మధ్యలోనే "అమ్మా" అని పిలిచిన నాన్న పిలుపుకు "వస్తున్నా నాన్నా!" అంటూ భగవద్గీతని చేతిలోకి తీసుకొంది శాంత.

* * *

పసిపిల్లల మొహంలోని నైర్మల్యం, యోగుల మొహంలోని కాంతి కలబోసుకొని, చిన్న చిరునవ్వుగా మారి తండ్రి మొహంలో నిలిచినట్లు అనిపించింది శాంతకి – భగవద్గీత వింటూ నిద్రలో కొరిగిన తండ్రిని చూస్తుంటే.

. ఈ సమస్యకి త్వరలోనే పరిష్కారం ఆలోచించవలసిందే అనుకుంది శాంత తండ్రికి దుప్పటి కప్పుతూ.

తండ్రి తర్వాత, తన జీవితంలో ప్రవేశించి,

అప్పుడప్పుడు తన ఆలోచనల్లో చోటు చేసుకునేది విశ్వం మాత్రమే.

ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది. వెంటనే కలం అందుకుంది.

విశ్వానికి,

అశాంతితో అలమటించిపోతున్న ఈ శాంతకి శాంతి నిచ్చేది... నీ ఓదార్పు తప్ప మరేదీ లేదని తెలిసి... ధైర్యంచేసి నీకు ఈ ఉత్తరం వ్రాస్తున్నా, అన్యథా భావించవుకదూ ?

సరస్వతీ కటాక్షంవల్ల, నాన్న ప్రేమకు పాత్రుడివై వింతగా మాజీవితాలలో ప్రవేశించావు. ఇంతవరకు మాలో ఒకడిలా కలిసిపోయావు. ఉద్యోగాన్వేషణ ప్రారంభించిన వెంటనే చక్కని ఉద్యోగం దొరికిన...ఇక నీవు మమ్మల్ని మరచి పోయినా అది తప్పుగా భావించను. ఎందుకో తెలుసా ? నవ్వులాగే, మరుపుకూడా, దేముడు మనిషి కిచ్చిన వరం కాబట్టి ! కాని ఉద్యోగం దొరికి సంవత్సరమైనా మరచిపోని, నీ మంచి తనపు మర్రిచెట్టు నీడన కాస్త విశ్రాంతి తీసు కుందామనిపించింది విశ్వం !

అందరు తండ్రుల్లాగే నాన్న కూడా, నా పెళ్లి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నాడు, గాని పిచ్చినాన్న. నన్నొదిలి బ్రతగ్గలడా ? నాన్న సంగతి నాకు బాగా తెలుసు. మరణానికైనా సిద్ధమవగలడు గాని నన్ను తన జీవితాంతం అవివాహితగా చూడగలడా ?

అసలే ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న నాన్న... నా ఎడబాటు వల్ల వచ్చే దిగులుతోనో, ఏ పనులూ చేసుకోలేని అశక్తత వల్లో...ఎన్నాళ్లు జీవిస్తాడో చెప్పలేను విశ్వం !

ఇలాంటి తలా తోకా లేని సమస్యలతో సతమత మౌతున్న నాకు నీ సలహాలు, సానుభూతి ఎంతో అవసరం విశ్వం !

నీ ఉత్తరం కోసం ... ఎదురుచూస్తూ

నీ

శాంత.

* * *

ఎగిరెగిరి గంతు వేయాలనిపించింది విశ్వానికి—మాస్టారినుండి, శాంత నుండి—ఒకేసారి వచ్చిన ఉత్తరాలు చూసి.

ఎప్పుడూ, ఎదురుగా కూర్చొని గంటల తరబడి కాలం గడిపినా నోరెత్తి మాట్లాడని శాంత నుండి ఉత్తరం చూసి ఆత్రుతగా చింపాడు విశ్వం.

ఉత్తరంలో విషయాలన్నీ చదివి ... మనసంతా ఆదోళా అయిపోయింది. రెండో ఉత్తరం చించడానికి ధైర్యం చాలలేదు.

"ధర్మారావు మాస్టారు."

తల్లిదండ్రులు ముందుగానే ఆయన ప్రవర్తనని ఊహించి ఆ పేరు పెట్టారా అనిపిస్తుంది — ఆయన్ని తలచుకొన్నప్పుడల్లా. ఉదయం ఎనిమిదినుండి, రాత్రి ఎనిమిదివరకూ

ఎలాగైనా జీవితంలో పైకి రావాలన్న ఆలోచన తనని ధర్మారావు మాస్టారి పాదాల వద్దకు చేర్చింది.

పాదాలవద్ద నున్న తనని అక్కునజేర్చుకొని ఆదరించిన ధర్మారావు మాస్టార్ని తను మరచి పోవడం ? ... జీవించి ఉండగా జరగనిపని అది.

శెట్టి కొట్లో పనులు ముగించుకొని, రాత్రి పది అయ్యేసరికల్లా మాస్టారి యింటికి చేరుకునే వాడు తను.

మగతనిద్రలో ఉన్న మాస్టారు నిద్రలేచి... పాఠాలు చెప్పడానికి ఉపక్రమించేవారు — తన ఆరోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టకుండా.

చదువులో తన చురుకుదనం చూసి ఎంతో సంబరపడి పోయేవారు మాస్టారు.

అంతగా ఆస్తిపాస్తులు లేని మాస్టారి జీవితంలో...ఆరేసినెలలు వరసగా జీతాలందక పోవడం మామూల్లే.

అలాంటి ఆర్థిక పరిస్థితుల్లో...వారి బడుగు జీవితాల్లో భాగం పంచియిచ్చారు. కష్టాల కాలకూటాల్ని సర్వేశ్వరుడిలా భరిస్తూ, ఆనందాల్ని వెన్నెల వెలుగుల్లా పంచియిచ్చే తత్వం మాస్టారుది. భోజనానికి, నిద్రకి విశ్వం పరుగులు చూసిన మాస్టారిమనసు కరిగిపోయింది. ఫలితంగా వారి వీధిగదిలోకి మకాం మారిపోయింది. తిండి, బట్టా, పుస్తకాలు...అన్నీ ఖర్చులు ఆయనివే. జీతం పందరూపాయలూ ఏమూలకూ రావని తెలిసినా వేణ్ణీళ్లకి చన్నీళ్ళు తోడుగా ఉంటాయని మాస్టారికే యిచ్చేసేవాడు విశ్వం.

మాస్టారి దీవెనలూ, విశ్వం పరిశ్రమా ఫలించాయి. ఫలితంగా ఆంధ్రా మెట్రిక్‌లో స్టేట్‌ఫస్ట్‌లో పాసయ్యాడు విశ్వం.

ఆ శుభవార్త మాస్టారికి చెపుదామని పరుగు పరుగున వెళ్ళాడు విశ్వం. "చాలా సంతోషం విశ్వం" అని "రేపు కాలేజీలో జాయినవు !" అన్నారు ఆజ్ఞాపిస్తున్నట్టుగా.

"మరి ఉద్యోగం ?" అన్నాడు విశ్వం ఆశ్చర్యంగా.

"మానేసేయ్" అన్నారు అంతేకాకుండా "విశ్వం ! ఐదేళ్ళ నీ కష్టార్జితం వడ్డీతో కలిపి మొత్తం ఎనిమిది వేలయింది. దానిలో ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా దాచి ఉంచాను. నీ పేర బాంక్‌లో వేసుకో. ఇంజనీరింగ్ చదవ డానికి పనికొస్తుంది" అన్నారు శాంతంగా.

ఆయన మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు, విశ్వం మనస్సులోని ఉద్వేగం మంచులో కరిగి, కన్నీరుగా మారి మాస్టారి పాదాభిషేకం చేసింది.

"చూడు విశ్వం ! 'కష్టే ఫలే' అన్న నానుడి మీద ఎంతో నమ్మకమున్న వాణ్ణి నేను. నీవు బాగా చదవగలవన్న నమ్మకం నాకున్నా, శ్రమజీవితంలోని విలువ తెలియాలని, ఇంత

చదువు సరాటకంగా సాగనాలంటే ఇలాంటి ఉద్యోగాలతో కుదరదు" అన్నారు మాస్టారు.

"మాస్టారూ ! అంటే పూర్తిగా మీకు భారంగా మారి..." — హిమాలయంలాంటి మాస్టారి వ్యక్తిత్వం ముందు...విశ్వానికి మాటలు పెగల్లేదు.

"చూడు విశ్వం ! నాకొచ్చిన నాలుగు ముక్కలు చెప్పడానికి, మాతోబాటు కలోగంజో మరో విద్యార్థికి పంచడానికి, నీలాంటి పేద విద్యార్థినుండి డబ్బు తీసుకొని... ఆ చదువుల తల్లికి అవమానం చేయలేను" అని విశ్వాన్ని తృప్తిగా కౌగిలించుకున్నారు మాష్టారు.

ఆయన సలహామేరకు యింటర్‌లో జాయిన వడం, తర్వాత ఇంజనీరింగ్ పూర్తి చేయడం... కలలో సంఘటనల్లా జరిగిపోయాయి.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది విశ్వానికి. ధర్మారావు మాష్టారు వ్రాసిన ఉత్తరం సంగతి... వణుకుతున్న చేతుల్తో ఉత్తరాన్ని చించాడు.

* * *

నిశ్శబ్దంగా మాష్టారి లెటరు మడచి జేబులో పెట్టుకున్నాడు విశ్వం. తన సర్వస్వం.. తనకి ధారపోయమని మాష్టారు అన్నా... తను సిద్ధమే. అమూల్యమైన మాష్టారి, ప్రేమాభి మానానికి ఋణం తీర్చుకోవాలనుకుంటే ఈ జన్మ చాలదు.

గాని... గాని... మాష్టారు కోరిన ఒకే ఒక్క కోరిక... చిన్న కోరికని నెరవేర్చలేని తన అశక్తతని, తననీ పరిస్థితులకి గురిచేసిన పరిస్థితుల్ని ఎలా తిట్టుకోవాలో అర్థంకాలేదు విశ్వానికి.

ఆరేడు సముద్రాల్లోని, అల్లకల్లోలాల్ని కలబోసి తన మెదడులో జొప్పించినట్లు అనిపించింది.

అల్లకల్లోలమైన ఆ సముద్ర కెరటాల్ని... వాటి ధాటిని తట్టుకునే శక్తి తనకుందా ? మాష్టారి మనస్సులోని కోర్కెని నెరవేర్చలేని తన నిస్సహాయతని ఆయన స్వార్థంగా భావిస్తే ?

కోరక కోరక కోరిన ఆయన కోర్కెను మన్నించి తనను తను మోసం చేసుకోలేడు. గాని ఆయనను కాదని, మనసుని నొప్పించి తను మన లేడు. తలాతోక లేని ఈ సమస్యను పరిష్కరించే నాథుడెవరు ?

ఇరవై నాలుగేళ్ళ. . తన జీవితంలో ఎన్నో సమస్యల్ని సులభంగా పరిష్కరించింది—ధర్మారావు మాష్టారు.

ఈ సమస్యకు కూడా పరిష్కారం లభించేది మాష్టారి వద్దే అనిపించింది. వెంటనే వింజరం వెళ్ళే బస్సెక్కాడు విశ్వం.

* * *

"దీర్ఘాయుష్మాన్ భవ" అన్నారు ధర్మారావుగారు. కాళ్ళకు నమస్కరిస్తున్న

విశ్వాన్ని ఆప్యాయంగా రెండు చేతుల్తో లేవ నెత్తుతూ.

ఒకప్పుడు మాసిపోయిన బట్టల్తో, అమాయకమైన మొహంతో, నలభైవాట్ల బల్బు వెలుగులో దీక్షగా చదివే విశ్వం, ఈనాడు ఇస్త్రీ చేసిన బట్టల్తో, ప్రపంచాన్ని జయించే ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతుంటే — మాష్టారి కళ్ళు గర్వంతో మెరిశాయి.

దారిపక్క, ఏ పశువుకో ఆహారంగా మార వలసిన పిచ్చిమొక్క... ఈనాడు నిండుగా పెరిగి, సుగంధాలు విరజిమ్మే చక్కని పూలు పూసే మొక్కగా మారినందుకు, ఆ మారడంలో తన పాత్ర ఉన్నందుకు ... ఓ విధమైన తృప్తి ఆయన పెదవులపై చిరుదరహాసమై నిలిచింది.

''బాగున్నావా విశ్వం! నిన్నిలా చూస్తుంటే నా కెంత గర్వంగా ఉందో తెలుసా'' అన్నారు తృప్తిగా.

''అంతా మీ చలువ మాష్టారూ! మీ ఆదరణా, అభిమానంలేని ఈ విశ్వం బ్రతుకెలా మారేదోకూడా ఊహకందనంత ఆప్యాయతతో పెంచిన మీ ఋణం తీర్చగలిగే శక్తి నాకెక్కడిది మాష్టారూ'' అన్నాడు విశ్వం.

''మంచినీళ్ళు తీసుకో విశ్వం'' అంది శాంత.

''బాగున్నావా శాంతా ?'' అన్నాడు విశ్వం నవ్వుతూ.

చిరునవ్వే సమాధానంగా చెప్పింది శాంత.

''మాష్టారూ! వయస్సు మీమీద, నామీద, నాకు తెలిసిన అందరిమీదా తన ప్రభావాన్ని చూపించి ... ఒకే ఒక్కచోట వోడిపోయింది. నేను పదేళ్ళప్పుడు చూచినప్పటి మాట్లాడని మల్లెమొగ్గ, అప్పటికీ యిప్పటికీ అలాగే ఉంది'' అన్నాడు విశ్వం శాంతవైపు ఆప్యాయంగా చూస్తూ.

''ఏమిటో విశ్వం ! ఈ బీదబడిపంతులు కూతురుగా పుట్టడమే నా శాంతమ్మ తల్లి చేసుకున్న పాపమేమో'' అన్నారు ధర్మారావుగారు బాధగా.

ఆ మాటలు వినడం ఇష్టంలేని శాంత వంటింట్లోకి వెళ్ళిపోయింది.

''మాస్టారూ ! ఇంతవరకూ మీ విశ్వం మీ రడిగిన ప్రతిప్రశ్నకూ సమాధానం చెప్పే వాడు. ఈసారి ''ప్రశ్న...సమాధానం'' కూడా మీదే'' అనుకున్నాడు విశ్వం మనసులో.

* * *

వేపచెట్టు మీదనుండి వీచే చల్లగాలి విశ్వం మనసుకు కాస్త ఊరట కలిగించింది. పాతబడిన పెంకుటింటి కప్పుమీద కూర్చొన్న కాకి కావు కావుమని అరుస్తోంది. చెట్టుమీద పిచికలు చేసే గోల మనసుకు ఆహ్లాదం కలిగిస్తోంది.

''విశ్వం తనమాట కాదంటే?'' —ఏం చేయాలో అర్థంకాలేదు మాస్టారుకి. ఆలోచనలు



# గు రు ద క్షి ణ

సతమతం చేస్తుంటే, చేసేదిలేక పడక్కుర్చీలో వెనక్కువాలి కళ్ళుమూసుకున్నారు మాస్టారు.

పెను తుఫానుకు లోనవుతానని తెలిసినా ధైర్యంగా వలలు వేసుకొని చేపలు పట్టడానికి పోయే బెస్తవాని మనసులా ఉంది...'' ఎదురుగా స్టూలుపై కూర్చొన్న విశ్వం మనసు.

పది నిముషాలపాటు ఇరువురిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది.

మాస్టారే ముందుగా ప్రారంభించారు. ''చూడు విశ్వం ! ఉత్తరంలో నేను కోరినకోర్కె సామాన్యమైనది కాదని నాకు పూర్తిగా తెలుసు. నా ప్రశ్నకు, నీ సమాధాన మేదైనా నీవు నా విశ్వానివే. నిస్సంకోచంగా నీ అభిప్రాయం చెప్పు. నీవు తీసుకునే నిర్ణయంలో పొరపాటు ఏమాత్రం జరిగినా బాధపడేది నీ వొక్కడవేకాదు. నేను కూడా !''

ఈనాడూ,ఏనాడూ మాస్టారి తత్వమే అది. ఆదరించడమే గాని ఆశించడం ఎరగనిది ఆయన వ్యక్తిత్వం.

విశ్వం కనులలో నీళ్ళు నిలిచాయి. ''వరాలిచ్చిన దేముడు కోరిన... ఒకే ఒక్క కోరికను...'' విశ్వం మనసులో సుళ్ళు తిరుగుతున్న మాట గొంతుదాటి రాలేకపోతున్నట్లు గ్రహించారు మాస్టారు.

''తీర్చలేకపోతున్నానని బాధపడుతున్నావా విశ్వం ! నా జీవితంలో మొదటిసారి యాచించింది నిన్నే. ఎందుకో తెలుసా ? నీవద్ద ఆ చనువు, నీమీద ఆ అధికారం ఉన్నాయన్న భావన. నా కోర్కె తీర్చలేదని నీవెంత బాధపడుతున్నావో... తీర్చలేని కోర్కె కోరినందుకు నేనంతగా... బాధపడుతున్నా. నీవూ వ్యక్తుడవయ్యావు. శాంత అందచందాలు నీకు నచ్చకపోవచ్చు. ఇంజనీరువైన నీవు ఇంకా చదువుకున్న అమ్మాయిని నీ సహధర్మచారిణిగా కోరుకోవచ్చు... నీ హోదా... !''

''మాస్టారూ ! మీ దయాదాక్షిణ్యాలమీద పెరిగిన నేను మిమ్మల్ని ఏనాడూ మిమ్మల్ని దైవం

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
* మన సినిమాలు
* వింత యదార్థం
శీర్షికలు
చూస్తున్నారా ?

కన్నా తక్కువగా అంచనా వేయలేదు...వేయలేను కూడా. నాకు నచ్చనిది శాంత అందచందాలూ... చదువు సంధ్యలూ... కావు మాస్టారూ ? శాంత మీ కుమార్తె కావొచ్చు. కాని నాకెవరో తెలుసా. ఆకలికి అన్నం పెట్టిన అమ్మ. అభిమానం పంచిపెట్టిన చెల్లి. నా అల్లర్లకి అదలించిన అక్క. నా ఉన్నతిని కాంక్షించిన దేవత. అలాంటి శాంతను దైవంలా ఆరాధించగలనుగాని భార్యగా ఊహించలేను మాస్టారూ...'' బావురుమన్నాడు విశ్వం.

''నీ మనసును గ్రహించకుండా నిన్ను యిబ్బంది పెట్టినందుకు నన్ను మన్నించు విశ్వం ! నన్నింత గౌరవంగా చూసుకునే నీవు, నా శాంతమ్మను ప్రాణప్రదంగా ఏలుకుంటావని అనుకున్నానుగాని... నీకు శాంతపై ఎలాటి అభిప్రాయం ఉందో ఊహించలేని నా మూర్ఖత్వాన్ని మన్నించు విశ్వం'' అన్నారు మాస్టారు.

''మాస్టారూ ! అనాథనైన నాకు మీరిద్దరూ... రెండు నేత్రాలై దారి చూపారు. ఊరూ పేరూ, కులమూ గోత్రమూ, అమ్మా నాన్నల పేర్లు కూడా తెలియని నాలాంటి అనాథని సాకడమే కాకుండా... మీ కుటుంబంలో స్థానమిచ్చి ఆదరిద్దామనుకున్న మీ ఔన్నత్యానికి విలువకట్టే శక్తి నాకులేదు. మీ మాట కాదని... మిమ్మల్ని నా నిర్ణయానికి... అంగీకరించమని అర్థిస్తున్నా...నా కోర్కెను మన్నిస్తారు కదూ మాష్టారూ !''

''చెప్పు విశ్వం ! కేవలం విద్యలోనే కాకుండా, మానవత్వపు విలువల్లో ఎంతగానో ఎదిగిపోయిన నిన్ను చూస్తుంటే నాకెంత సంబరంగా ఉందో తెలుసా ''

''అమ్మా నాన్నలంటే తెలియని నేను మీలో ఆ యిద్దర్నీ చూసుకున్నా. కాని నన్ను కని, ఈ జనారణ్యంలో నిర్దాక్షిణ్యంగా వదిలి, వారిదారి చూసుకొన్న ఆ స్వార్థపరుల్తో మిమ్మల్ని పోల్చి, కించపరచ దలచుకోలేదు. ఈనాటినుండి మీ బాధ్యతలన్నీ నావే. శాంతకు చక్కని వరుడ్ని చూసే బాధ్యత, అన్నగా ఆదరించే అదృష్టం, వృద్ధాప్యంలో మీకు సేవ చేసుకునే భాగ్యం నాకు ప్రసాదించండి ... కాదన...''

''విశ్వం ! చదువుల తల్లిని నమ్మిన వాడెప్పుడూ చెడిపోలేదు. ఆనాడు పోతన పరువు నిలిపిన తల్లి, ఈనాడు నడిసముద్రంలో నావలా, దిక్కుతోచని నాకు దారి చూపింది నీ ద్వారా...!'' అంటూ కాళ్ల వద్ద నున్న విశ్వాన్ని లేపి అక్కున జేర్చుకున్నారు.

వెచ్చని రెండు కన్నీటిబొట్లు విశ్వం తలను తాకాయి. మరి రెండు కన్నీటి చుక్కలు ... మాస్టారి పాదాల్ని అభిషేకం చేశాయి. ★